క్లుప్తంగా

పోలేరమ్మ జాతరకు ఏర్పాట్ల పూర్తి

కాజులూరు: ఆర్యావటంలో గ్రామ దేవత పోలేరమ్మ జాతర, తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం కమిటీ సభ్యుడు పుల్లేపు సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 300ఏళ్ల క్రితం పోలేరమ్మ తల్లి వెలసిందన్నారు. ఏటా వైశాఖ మాసం అమావాస్య రోజున అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి చిన్న జాతర (వీధి సంబరాలు), మంగళవారం రాత్రి పెద్ద జాతర మహోత్సవాలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని తెల్లవారే వరకు గ్రామ వీధుల్లో ఊరేగిస్తారన్నారు. అనంతరం బుధవారం వేకువ జాము నుంచి ఆలయం వద్ద తీర్థమహోత్సవాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం తగిన వసతి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కాజులూరు: గ్రామాలలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఏఎన్ఎంలు, హెల్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో జరిగిన ఆశావాలంటీర్లు, ఏఎన్ఎంలు, హెల్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని గర్భిణులు, బాలితల ఆరోగ్యంపై సిబ్బంది తరచూ పర్యవేక్షణ చేస్తూ వారికి అవసరమైన మందులు క్రమం తప్పకుండా తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార నియమాలు, దిన చర్యలపైనా వారికి తగిన సూచనలు అందించాలన్నారు.

ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్లకు సెలవు

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ఆర్టీసీ రామచంద్రపురం డిపోలో బస్ పాస్ కౌంటర్లు ఈ నెల 6, 7వ తేదీల్లో పని చేయవని డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాస్‌లు నమోదు చేసే ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించి, కొత్త సాఫ్ట్‌వేర్‌కు మార్చుతున్నందున సెలవు ఇచ్చినట్టు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు సహకరించాలని కోరారు.

ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉండాలి



కపిలేశ్వరపురం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై పరదేశి

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉండాలని అంగర ఎస్సై అందే పరదేశి కోరారు. కపిలేశ్వరపురంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ లెక్కింపు ప్రక్రియలో భాగంగా పోలీసు ఉన్నతాధికారులు రూపొందించిన నిబంధనలను విధిగా పాటించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు.

రికార్డుల పరిశీలన



ఆలమూరులో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, జొన్నాడ, పెనికేరు తదితర గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో రికార్డుల పరిశీలన జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్ ఆయా కేంద్రాలకు వెళ్లి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్

అంబాజీపేట: నందంపూడిలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి వారిని మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు యలమంచిలి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంత్రి విశ్వరూప్ ఆలయాన్ని సందర్శించుకోవడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. అనంతరం విశ్వరూప్‌ను పార్టీ నాయకులు సత్కరించారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, నాగాబత్తుల సందీప్, కూరాకుల వెంకయ్య, నాగాబత్తుల శశి తదితరులు ఉన్నారు.

విజేతను నిర్ణయించేది మహిళలే

- మండపేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,20,494
- మహిళా ఓటర్లు 1,13,263
- ఓటు వేసిన మహిళలు 97,735 మంది
- వారి ఓటింగ్ శాతం 86.29
- నేడు లెక్కింపు నేపథ్యంలో ఉత్కంఠ



మే 13న అంగర పోలింగ్ బూత్‌లో క్యూలో మహిళా ఓటర్లు

కపిలేశ్వరపురం: ఆకాశంలో సగమున్నాం... అన్నింటా మేమున్నాం... మహిళలు అంటుంటే ఏమో అనుకునేరు. వారి శక్తికి అంతే లేదు ఆ విషయం మంగళవారం నిర్వహించే సార్వత్రిక ఎన్నికల ఓట్ల నేపథ్యంలో నిరూపితం కానుంది. మండపేట నియోజకవర్గంలో రాజకీయ నాయకులు, విశ్లేషకులు పెన్నూ, కాగితం పట్టుకుని గెలుపు ఓటములపై లెక్కలు వేసుకుంటున్నారు. వారందరి దృష్టి మహిళా ఓటింగ్ పైనే ఉంది. నియోజకవర్గంలో మహిళా ఓటింగ్ తీరుతెన్నులపై ఈ కథనం...

నియోజకవర్గంలో పోలింగ్ ఇలా..

మండపేట పట్టణంలోని 30 వార్డుల్లో 48,84 మంది ఓటర్లుకు గానూ 25,686 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అందులో 21,943 మంది ఓటు వేయడంతో పోలింగ్ శాతం 85.42గా నమోదైంది. మండపేట మండలంలోని 12 గ్రామాల్లో 64,464 ఓటింగ్ ఉండగా 33,150 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 28,468 మంది ఓటు వేయడంతో 85.87 శాతం నమోదైంది. రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో 53,108 మంది ఓటర్లుండగా 27219 మంది మహిళా ఓటర్లున్నారు.

వారిలో 23,365 మంది ఓటు వేయడంతో 85.84 శాతం నమోదైంది. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో 54,075 ఓటింగ్ ఉండగా, అందులో మహిళా ఓటర్లు 27,208 మంది. అందులో 23,959 మంది ఓటు వేయడంతో 88.05 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం మండపేట నియోజకవర్గంలోని 2,20,494 ఓట్లలో 1,13,263 మహిళా ఓట్లున్నాయి. వాటిలో 97,735 మంది మహిళలు ఓటు వేయడంతో 86.29 శాతం పోలింగ్ నమోదైంది.

మండపేట పట్టణంలో మహిళా ఓటింగ్ ఇలా..

పట్టణం	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓట్లు	మహిళల ఓట్లు	పోలైన మహిళల ఓట్లు	పోలింగ్ శాతం
మండపేట	64 - 109	48847	25686	21943	85.42
మండపేట మండలంలో ఓటింగ్ ఇలా..					
కేశవరం	01 - 08	8342	4209	3814	90.61
వేములపల్లి	09 - 15	8280	4318	3479	80.56
ద్వారపూడి	16 - 21	5622	2854	2407	84.33
జెడ్.మేడపాడు	22 - 26	5433	2789	2425	86.94
మెర్నిపాడు	27	688	359	325	90.52
పాలతోడు	28 - 29	1954	978	897	91.71
ఇప్పనపాడు	30 - 34	4234	2208	1958	88.67
అర్తమూరు	35 - 39	5501	2893	2534	87.59
తాపేశ్వరం	40 - 45	5831	3004	2500	83.22
వై.సీతానగరం	46 - 47	1847	933	798	85.53
ఏడిద	48 - 63	13312	6838	5832	85.28
మారేడుబాక	110 - 112	3420	1767	1499	84.83
మొత్తం		64,464	33,150	28,468	85.87

రాయవరం మండలంలో గ్రామాలవారీగా ఓటింగ్

పట్టణం	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓట్లు	మహిళల ఓట్లు	పోలైన మహిళల ఓట్లు	పోలింగ్ శాతం
రాయవరం	113 - 119	6621	3453	2830	81.95
వెదురుపాక	120 - 123	4467	2297	2005	87.28
వి.సావరం	124 - 126	2446	1278	1173	91.78
నదురుబాద	127	886	438	400	91.32
లొల్ల	128	1177	610	590	96.72
సోమేశ్వరం	129 - 135	7051	3595	3062	85.17
మాచవరం	136 - 142	7215	3723	3161	84.90
చెల్లూరు	143 - 151	8751	4466	3699	82.82
కూర్మాపురం	152 - 153	1936	980	865	88.26
కురకాళ్లపల్లి	154	1225	616	560	90.90
వెంటూరు	155 - 159	4724	2389	2091	87.52
పసలపూడి	160 - 165	6609	3374	2929	86.81
మొత్తం		53,108	27,219	23,365	85.84

కపిలేశ్వరపురం మండలంలో గ్రామాల వారీగా పోలింగ్

పట్టణం	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓట్లు	మహిళల ఓట్లు	పోలైన మహిళల ఓట్లు	పోలింగ్ శాతం
నేలటూరు	166 -168	2812	1427	1310	91.80
వల్లూరు	169 - 171	3215	1645	1454	91.80
నిడసనమెట్ట	172	1000	488	458	93.85
వడ్లమూరు	173 - 174	1280	642	566	88.16
అచ్యుతాపురం	175	1065	559	500	89.44
కాలేరు	176 - 177	1855	921	870	94.46
నల్లూరు	178 - 179	2013	1016	927	91.24
పడమర ఖండ్రిక	180-182	2964	1503	1321	87.89
వెదురుమూడి	183 - 184	1917	943	833	88.33
అంగర	185 - 192	7405	3708	3268	88.13
తాతపూడి	193 - 194	1831	942	808	85.77
కపిలేశ్వరపురం	195 - 201	6578	3330	2779	83.45
కేదారిలంక	202 - 204	3250	1631	1352	82.89
టేకి	205 - 209	4770	2460	2173	88.29
మాచర	210 - 213	3023	1562	1428	91.42
కోరుమిల్లి	214 - 218	5021	2419	2110	87.22
అద్దంకివారిలంక	219 - 220	2007	957	843	88.08
వాకతిప్ప	221-222	1421	721	642	89.04
నాగులచెరువు	223	653	333	317	95.19
మొత్తం		54,075	27,208	23,959	88.05

ముందస్తు సాగుకు సానుకూలం

- ఒకటి రెండు రోజుల్లో నైరుతి రాక
- కాలువలకు నీరు విడుదల చేసిన అధికారులు
- ఉత్సాహంగా పొలం బాట పట్టిన రైతులు
- క్లస్టర్ పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో సాగు



వరి నారుమడిని సిద్ధం చేస్తున్న కూలీలు

రాయవరం: రబీలో మంచి దిగుబడులు రావడంతో అన్నదాతలు ఆనందంగా ఖరీఫ్ పనులకు పొలం బాట పట్టారు. ఖరీఫ్ వరి సాగుకు అన్నీ మంచి శకునాలే వచ్చాయి. ఏటా ముందస్తు సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అధికారుల సలహాలను చెవి నెక్కించుకుంటున్న అన్నదాతలు పొలంబాట పట్టారు. ఇప్పటికే కాలువలకు నీటి పారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేయగా, ప్రకృతి కూడా తోడైంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పనులకు అనుకూలిస్తున్నాయి. ఇప్పటికే బోర్లపై వరినారుమళ్లను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.

స్వర్ణకే రైతుల మద్దతు

సాధారణంగా ఖరీఫ్‌లో రైతులు అధికంగా స్వర్ణ రకాన్నే సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు స్వర్ణ రకాన్ని సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంచుమించు 90 శాతం మంది రైతులు స్వర్ణ వంగడాన్నే సాగు చేస్తుండగా, మిగిలిన 10 శాతం ఎంటీయూ 1318, ఎంటీయూ 1064, ఇతర విత్తన రకాలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు రైతులు బోర్లపై నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. సాధారణ పద్ధతిలో సాగు చేసే రైతులు మాత్రం నారుమళ్లను సిద్ధం చేసుకుంటుండగా, ఖరీఫ్‌లో కూడా అధిక శాతం రైతులు వెదజల్లు విధానానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

ముందస్తుకు ప్రకృతి అనుకూలం

ప్రస్తుతం రోహిణి కార్తె కొనసాగుతోంది. అయినప్పటికీ అడపా దడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌కు అనుకూలంగా మారాయి. ఎండలు తగ్గి వర్షాలు కురుస్తుండగా, ఒకటి రెండు రోజుల్లో నైరుతి రుతు పవనాలు రానున్నాయన్న సంకేతాలు రైతులను సంతోషానికి గురి చేస్తున్నాయి. ఇదిలా ఉంటే జూన్ 1వ తేదీనే నీటి పారుదల శాఖ కాలువలకు నీటిని విడుదల చేసింది. రైతులు వరి నారుమళ్లను సిద్ధం చేస్తుండగా, వ్యవసాయ శాఖ కూడా వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచింది. రైతులకు అవసరమైన ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలువురు రైతులు తమ పొలాలను దుక్కి దున్ని ముందస్తు సాగుకు సన్నద్ధం చేసుకుంటున్నారు.

క్లస్టర్ పరిధిలో ఇదీ పరిస్థితి

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేపడుతున్నారు. క్లస్టర్ పరిధిలో రైతులు రబీ పంటను ఒబ్బిడి చేసుకుని, ఖరీఫ్ పనులకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. రబీలో అంచనాలకు మించి వచ్చిన దిగుబడులతో రైతులు రబీకి మరింత ఉత్సాహంగా సాగు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

ముందస్తు సాగు చేపట్టాలి



రైతులు ముందస్తు సాగును చేపట్టాలి. దీని వలన నవంబరు, డిసెంబరుల్లో వచ్చే తుఫాన్ల నుంచి పంటను కాపాడుకునే వీలుంటుంది. రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాం. ఈ ఏడాది ఖరీఫ్‌కు అనుకూల పరిస్థితి ఉంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



పి.దొరరాజు సీఐ రామచంద్రపురం

రామచంద్రపురం/కె.గంగవరం: కౌంటింగ్ నేపథ్యంలో రామచంద్రపురం పోలీస్ సర్కిల్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం సీఐ పి.దొర రాజు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపుగా ఒక చోట ఉండకూడదన్నారు. అభ్యర్థులు, ఆర్వో ధ్రువీకరించిన కౌంటింగ్ ఏజెంట్లు తప్ప ఇతరులు ఎవ్వరు ఎలక్షన్ కౌంటింగ్ ప్రదేశానికి వెళ్లకూడదన్నారు. గెలుపు, ఓటములు సహజమని, ప్రజా తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని, భావోద్వేగాలకు లోను కాకుండా సంయమనం పాటించాలని కోరారు. రెచ్చగొట్టే పనులు చేయకుడదన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, మోటార్ సైకిల్ సైలెన్సర్లు తీసి నడపడం, బైక్ ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం వంటివి చేయకూడదన్నారు. గొడవలకు దిగడం గాని, గొడవలు ప్రోత్స హించడంగాని చేయరాదని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే ఎటువంటి చర్యలు జరగకుండా బాధ్యత తీసుకొని తగు జాగ్రత్త వహించాలని కోరారు. సోషల్ మీడియాలో ఎవరైనా ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా మెసేజ్‌లు పెట్టడం గాని, స్టేటస్‌లు పెట్టడంగానీ, ప్రజా శాంతికి భంగం కలిగించే మరే విధమైన మెసేజ్‌లు, వ్యాఖ్యలు చేసినా వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పై విషయాలను ప్రజలందరూ గమనించి జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా యువత ఎలక్షన్ కేసుల్లో ఇరుక్కుని మీ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సీఐ హితవు పలికారు.

మొక్కలు పెంచండి.. భూ తాపాన్ని తగ్గించండి..

రామచంద్రపురం రూరల్: మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథ ప్రసాద్ మొక్కలను పెంచి భూ తాపాన్ని తగ్గించాలంటూ సందేశం ఇచ్చేలా చిత్రాన్ని గీసి అందరి మెప్పు పొందారు. ప్రతి ఏటా పెరుగుతున్న ఎండలను, భూ తాపాన్ని తగ్గించాలంటే మొక్కలు పెంచడం ఎంత అవసరమో చిన్న పిల్లల నుంచే అవగాహన కల్పించాలన్న సంకల్పం ఆయన వేసిన చిత్రంలో కనిపిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగమణిలు అభినందించారు.



రాయుడు త్రినాథ ప్రసాద్, డ్రాయింగ్ టీచర్



మొక్కలను పెంచాలని త్రినాథ ప్రసాద్ గీసిన సందేశాత్మక చిత్రం

పోలీసు బలగాల మోహరింపు



ఆలమూరులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు దృష్ట్యా మండలంలోని పోలీసులు భారీగా మోహరించారు. ఇప్పటికే పోలీసుస్టేషన్ పరిధిలో 144, 30 సెక్షన్లు అమలులో ఉందంటూ ఎస్సై ఎల్.శ్రీను నాయక్ నేతృత్వంలో పోలీసుల బృందం ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలను మూయించి వేశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ బలగాలకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ నియంత్రణ పాటించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. అనంతరం పోలీసుల బృందం గ్రామాల్లో పహరా నిర్వహించారు.

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

అంబాజీపేట: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా సోమవారం అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. మహనీయుల చరిత్రను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం వివిధ జంతువుల పేర్లు, దేశాలు వాటి రాజధానులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అనధికార మద్యం దుకాణంపై దాడి



నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై శ్రీనునాయక్

ఆలమూరు: స్థానిక కొత్తూరు సెంటర్‌లో విక్రయిస్తున్న అనధికార మద్యం దుకాణంపై ఆలమూరు పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం.. ఓట్ల లెక్కింపు దృష్ట్యా మూడు రోజుల పాటు మద్యం విక్రయాలను ప్రభుత్వ నిషేధించింది. దీన్ని ఆసరాగా తీసుకున్న జి.వెంకటరమణ అప్పటికే నిల్వ చేసుకున్న మద్యం బాటిళ్లను అధిక ధరకు విక్రయిస్తున్నాడు. దీనిపై అందిన సమాచారం మేరకు ఎస్సై నేతృత్వంలోని పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈమేరకు కేసును నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



సోము రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే రాపాక తదితరులు

మలికిపురం: అనారోగ్య సమస్యతో స్నేహితుడు పెసింగి సోము రాజు(బట్టిలంక) కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. నిరుపేదలైన కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఇది గమనించిన తోటి స్నేహితులు, అందరూ కలసి సమకూర్చిన రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని స్నేహితుని భార్యకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రాజు చిత్ర పటానికి ఎమ్మెల్యే రాపాక పూలమాలలు వేసి నివాళులర్పించి సాయం అందించారు. రాపాక నవీన్, పెదపాటి అనిల్, ఓగురి స్టీవెన్, చెవ్వకుల రాజు, గెడ్డం రవి, చొప్పల రాజేంద్ర, మంగేన సతీష్, గంట దిలీప్, చొప్పల భాను, మట్టా అనిల్, చింతా రమేష్ మరి గల్ఫ్ స్నేహితులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సైంటిఫిక్ మ్యాజిక్

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న బాలల వేసవి వినోద కేంద్రంలో మూడో రోజు సోమవారం మెజీషియన్ సైంటిఫిక్ మ్యాజిక్ షోను నిర్వహించారు. సైంటిఫిక్ మెజీషియన్ కాటూరు నాగేశ్వరరావు చేసిన పలు ప్రదర్శనలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. ప్రతి మ్యాజిక్ వెనుక సైన్స్ ఉందని స్పష్టం చేస్తూ తన ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కొన్ని ప్రదర్శనలను విద్యార్థులతో చేయించారు. అనంతరం మెజీషియన్ నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

వాడపాలెంలో యోగా శిక్షణ తరగతులు

కొత్తపేట: సంపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పూర్వపు జాతీయ క్రీడాకారుడు చీకట్ల రామారావు, రిటైర్డ్ పీఈటీ మారిశెట్టి సత్యనారాయణ అన్నారు. వాడపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు సౌజన్యంతో కొత్తపేట స్వామి వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ తరగతులను చీకట్ల రామారావు, మారిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో వ్యాయామం అవసరమన్నారు. యోగా లేదా వ్యాయామంతో అనారోగ్య రుగ్మతలు తొలగాపోయి ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. యోగా మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ యోగా శిక్షణా తరగతులు నిత్యం జరుగుతాయన్నారు. ఆరోగ్యంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గనిశెట్టి గోవిందరాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు, సభ్యులు సుతాపల్లి వెంకటసుబ్బారావు, ఆకుమూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.